డా॥ ముక్తేవి భారతి

# నిర్ణయం

ఇరవై తొమ్మిదేళ్ళు నిండిన సుందరికి, ఈ మధ్య మనసు మరీ బాగుండటం లేదు. ఒంటరితనం మరీ వేధిస్తోంది... కానీ, తన గురించి ఆలోచించే వాళ్ళే లేరనే అభద్రతా భావం మరీమరీ పీడిస్తోంది. సుందరికి ఆరోజు వెళ్ళాలనిపించలేదు.

ఈ ఉద్యోగం మానేస్తేనేం!? ఉద్యోగం మానేయటమా! సుందరి మనసులో చిన్న ఆశ ఉంది ఇంకా, ఉద్యోగం చేసే అమ్మాయిని పెళ్ళాడతానని ఎవడన్నారాడా అని!

"ఏమిటే, టైమయింది, ఆఫీసుకి వెళ్ళవా? సుందరి తల్లి గుమ్మంలో నిలబడింది.

అసలే మీ బాసు బ్రహ్మరాక్షసుడంటావు కదా ఆలస్యమయితే... ఏదో చెప్తూ, కిందపడ్డ మందారపువ్వు తీసి కళ్ళకద్దుకుని, సిగలో తురుముకుంది... సుందరి తల్లివైపు అలానే చూస్తోంది.

"అసలు ఉద్యోగం మానేయాలనుకుంటున్నా" సుందరి అలా అనే సరికి జానకమ్మ ఖంగారుపడిపోయింది.

"ఇలా అస్తమానం మానేస్తా, మానేస్తా అనకు, తథాస్తు దేవతలుంటారు" అంది జానకమ్మ లోపలికెళ్ళిలపోతూ...

పెళ్ళి చేసుకుంటా, ఎవర్నైనా పెళ్ళి చేసుకుంటా, తథాస్తు దేవతలు గొంతుపెగిలి రాలేదు బయటకి, తన మనసే బయటకొస్తే ఇంకేమయినా ఉందా!! వచ్చేనవ్వు ఆపుకుంటూ నోటికి చెయ్యి అడ్డంపెట్టుకుంది సుందరి.

ఏడాది పిల్లాడిని చంకనేసుకుని, గబగబా లోపలికి కొచ్చిన లలిత, కుంకుమ భరిణె పట్టుకొచ్చి జానకమ్మకి బొట్టు పెట్టింది, శ్రావణ మంగళవారం పేరంటం అని...

అక్కా నువ్వు ఆఫీసుకు వెళ్ళలేదా అంటూ సుందరికి బొట్టు పెట్టింది.

ఇంకేం, ఇవాళ ఆఫీసుకు ఎలాగు వెళ్ళలేదుగా అక్కా, మూడు గంటలకు వచ్చేయవా, నాకు కొంచెం హెల్ప్ చేద్దువుగాని, అంది పిల్లాడిని చంకనేసుకుని.

ఆ... తప్పకుండా వస్తా, అంది సుందరి, వెళ్ళిపోతున్న లలితని చూస్తూ...

జడలో పెద్ద కనకాంబరాల దండ, మెడలో మెరిసిపోతున్న పెద్ద చంద్రహారం, మెరుస్తున్న నల్లపూసల గొలుసు, ఘల్లు మంటున్న గజ్జలు, ఫెళ ఫెళాలడే పట్టు చీర, వీటన్నిటికీ తోడు చంకలో పిల్లాడు, ఇదేగా దాని గర్వం!!

ఆఫీసుకి సెలవు పెట్టాను కనక దానింటికొచ్చి సాయం చేయాలా, అక్కా ఆఫీసుకెళ్ళలేదా అంటుందా, ఎంతపొగరు అంటే, బతుకంతా ఆఫీసుకెళ్ళడమేనా నాపని, పొట్టిగా, నల్లగా పళ్ళెత్తుగా ఉండే, ఈ పదోక్లాసు పాసయిన లలిత, ఇవాళ ఓ ఇల్లాలూ, ఓ తల్లి అనొచ్చా, అక్కా ఆఫీసుకెళ్ళలేదా అంటుందా, సుందరికోపం కట్టలు తెంచుకుంది. ఆ కోపం తల్లి తండ్రి మీదకి ఎగబాకింది.

తల్లి ఆలోచన రాగానే సుందరి కళ్ళు ఎర్రబడ్డాయి. స్నానం చేస్తుంది జానకమ్మ, శుభ్రమైన చీర కట్టుకుంటుంది. రోజూ పూవులు సిగలో పెట్టుకోవల్సిందే, తొమ్మిదిన్నర అయ్యేసరికి పడగ్గదిలోకి వెళ్ళిపోతుంది.

ముప్ఫైయి ఏళ్ళొస్తున్న కూతురు పెళ్ళిపెటాకులు లేకుండా, ఓ చెత్త ఉద్యోగం చేసుకుంటూ పడుందని అనిపించదూ!

సుందరి కోపం కట్టలు తెంచుకుంది. జానకి మనసు బాగాలేదు. సుందరి తర్వాత ఇద్దరు ఆడపిల్లలు. ఆ ఇద్దరూ ప్రేమ వివాహాలు చేసుకున్నారు, తమ అభిప్రాయాలతో సంబంధం లేకుండా... కానీ, సుందరికి మంచి సంబంధం ఎందుకు చేయలేకపోయిందీ! నిజమే, దాని ఆవేదన కానీ, కానీ జానకి అంతరాత్మ ఎదురు ప్రశ్నించింది.

ఈ పిల్లకి కూడా పెళ్ళిచేసి పంపిస్తే తమకి దిక్కెవరూ, అంతరాత్మ ఫక్కున నవ్వింది. అందుకేగా పెళ్ళి గురించి పెద్దగా ఆలోచించకుండా, వదిలేసింది తాను!! తన అవసరం కోసం దానిపెళ్ళి కాకుండా చేసిందా!!

జానకి ఫాన్ మరీహైలో పెట్టి నిద్రపోయింది సుందరికి నిద్ర పట్టడం లేదు

ఏమంటీ, నాకెందుకో చాలా భయంగా వుందడీ, అది ఏం మాట్లాడుతుందో నాకేంతెలియటం లేదు... కొత్తగా పెళ్ళిగోల మొదలైంది, అంది భర్తతో.

జానకీ, నువ్వు బెంగపడకు, కొందరికి పెళ్ళిరాత దేవుడు రాయడు అంతే, అన్నాడు.

సుందరి అదే సమయంలో మనసులో అనుకుంది. కొందరికి పెళ్ళిరాత రాయడా, ఎందుకు రాయడో చూస్తా!

అయినా, సుందరి మనసు మరోదారిలోకి పరిగెత్తింది. చెల్లెళ్ళు ప్రేమ వివాహం చేసుకుని వెళ్ళిపోయారా, తనకి అదిచేత కాలేదా, అదేనా అమ్మ నాన్న అనేదీ, సుందరి గతంలోకి వెళ్ళిపోయింది.

రెండేళ్ళనాటి విషయం గుర్తొచ్చింది సుందరికి...

మామయ్య హడావిడిగా ఇంటికొచ్చాడు... తల్లితో చాలాసేపు మాట్లాడాడు. అంతలో నాన్న ఆ గదిలోకొచ్చాడు.

ఏం జరుగుతోంది లోపల?

అమ్మ గట్టిగా ఏదో అంటోంది? ఏమిటి?

నాన్న నసుగుతున్నాడు, ఏమిటి!

అంతలో తలుపులు బార్లాతీసి మామయ్య కోపంగా బయటకెళ్ళిపోయాడు.

అర్థమయింది విషయమేమిటో సుందరికి... మామయ్య చెప్పిన సంబంధం అమ్మకి నచ్చలేదు, ఆ అబ్బాయికి కాలుకుంటి అని! అయినా, తనకి చెప్పరేమిటి, తను ఇష్టపడి అంగీకరిస్తుందేమో! అంటే, ఇంకా నా పెళ్ళి విషయంలో నిర్ణయం వాళ్ళే తీసుకుంటారా!

పదిహేనురోజులు గడిచాయి... మామయ్య ఇంటికి రాగానే సుందరి ముఖం వికసించింది. తండ్రి గదిలోనికి వెళ్ళాడు.

నామాట వినలేదు ఇదుగో, రాధాకృష్ణ పెళ్ళి పై నెలలో, సుందరి చేతిలోవున్న కాఫీ కప్పు జారికిందపడిపోయింది.

కాలం పరిగెత్తింది,

సుందరి తలలో వెండితీగలు అక్కడక్కడా మెరుస్తున్నాయి.

ఇల్లంతా సందడి... చెల్లెళ్ళిద్దరూ పిల్లలతో కలసి వారం రోజులుండటానికి వచ్చారు. జానకి చాలా హడావుడిగా ఉంది. కూతుళ్ళు, మనవలు ఆమెకి ఎంతో ఆనందాన్నిస్తున్నారు. అబ్బా ఇద్దరు పిల్లలతో చేసుకోలేక ఛస్తున్నానుకో, అందులో ఈ చిన్నాడు పిడుగే బాబూ, పెంచటం మహాకష్టంగా ఉంది, అంది రెండవ కూతురు.

ఆ మాటకు తల్లి ఫక్కున నవ్వి, "అంత భాధైతే ఒకడ్ని అక్కకి పెంపకానికి చ్చేయ్, హాయిగా చూసుకుంటుంది" అంది. సుందరికి నోటమాట రాలేదు.

అక్కా నా కూతుర్ని పెంచుకో, లక్షల కట్నాలిచ్చి నేనెక్కడ పెళ్ళి చేయగలనూ, మీ మరిది అదే అంటారు. దీన్ని మీ అక్కకి దత్తత ఇచ్చేద్దాం అని, అంది సుందరి చిన్న చెల్లెలు వీణ.

సుందరి మాట్లాడలేదు.

సుందరి అద్దంలో చూసుకుంది. ఎర్రని లిపిస్టిక్ పెదాలు నిగనిగలాడుతున్నాయి. ఎదురుగా దేవునిపటం గోడపైన నా నిర్ణయాన్ని ఆశీర్వదించు, సమాజాన్ని ఎదిరించే శక్తి నివ్వు, చేతులు జోడించింది.

ధైర్యంగా ముందడు గేసింది ఆ ఉషోదయ సుప్రభాతాన సుందరి.

ఇంట్లో అంతా లేచారు. గబగబా పనులు చేసుకున్నారు... అక్క నిద్ర లేవ లేదా అంటూ గదిలో కొచ్చిన వీణ, సుందరి అక్కడ లేదని తెలుసుకుంది.

స్నానం చేస్తోందేమో! పొద్దున్నే ఎక్కడి కెళ్ళిందీ అంత అర్జంటు పనేమిటో, అంది సుగుణ.

తొమ్మిది గంటలు దాటింది... సుందరి రాలేదు. పది దాటింది, పదకొండు దాటింది...

"చెప్పి వెళ్ళవచ్చుగా... ఎవరొద్దంటారూ," అంది వీణ.

వద్దంటే అది వింటుందా? అంది తల్లి వంటింట్లోంచి దీర్ఘంతీస్తూ... తండ్రి గదిలో అటుఇటూ తిరుగుతున్నాడు. ఎవరి పనుల్లో వారున్నారు.

ఆటో గుమ్మంలో ఆగింది.

గబగబా లోపలికొచ్చింది సుందరి, సూర్యంతో కలసి

అంతా చూస్తున్నారు.

"ఇతను సూర్యం, నా భర్త. రిజిస్ట్రాఫీసులో పెళ్ళి చేసుకున్నాము.

సుందరి తల్లి తండ్రికి నమస్కరించింది.

మీ తరపున నేనే, నా రెండు చేతులతో నమస్కరిస్తున్నాను, అంది సూర్యం చేతిని పట్టుకు సోఫాలో కూచుంటూ,

చూసావా, నీకు మూడు చేతులు, నాకూ మూడు చేతులు అంది, అక్కడున్న వాళ్ళందరికీ అర్థమవ్వాలని.

అక్కడున్న వాళ్ళందరికీ ఒక్క చేతితోనే విష్ చేశాడు సూర్య. ఈ చేయిపట్టుకున్నా మీ చేయి వదిలేయను నాన్నా అంది సుందరి, తండ్రి కళ్ళలో కదిలే నీటి పొరను చూస్తూ...

అంతా అవాక్కయిపోయారు ఓ క్షణం!!

టెలిఫోన్ బూత్ చూసుకుంటాడు, నేనూ ఉద్యోగం మానేసి అతనితో పనిలో సాయంగా ఉంటాను అంది సుందరి అందరికీ అర్థమయ్యేలా...

సాయం సంధ్యాకాంతులు సుందరీ సూర్యంల ముఖాన మెరుస్తుంటే తెచ్చిన స్వీట్ పేకట్టు అందరికీ అందించింది సుందరి.

అక్క పెళ్ళి చేసుకున్నందుకు చాలా బాధపడ్డవాళ్ళు సుందరి చెల్లెళ్ళు, ఇంకేం దత్తతలే అయినా, అక్క అంత రహస్యంగా ఆ అవిటివాడిని పెళ్ళి చేసుకోవటమేమిటో, అంది కోపంగా సుగుణ.

ఎప్పటినుంచి స్నేహమో వాడు దీని ఉద్యోగం చూసే చేసుకున్నాడు, లేకపోతే వాడికి పెళ్ళేమిటీ అంది వీణ. ఆ చెల్లెళ్ళద్దరూ అక్క ఆవిటి వాడిని పెళ్ళాడిందని బాధపడుటం కన్నా, పెళ్ళి చేసేసుకుందని తెగబాధపడిపోయారు.

ఆ ఇంట్లో ఆ పెళ్ళిని మనసారా ఆశీర్వదించినవాడు సుందరి తండ్రి ఒక్కడే... ఆలస్యంగానైనా మంచి నిర్ణయమే తీసుకుంది. అతనికి లేంది ఒక్కచేయి మాత్రమే, మనకి మనసే లేదు అనుకున్నాడు సుందరిని సూర్యాన్ని చూస్తూ. ఆనందంగా.

కాలం గడుస్తోంది. కూతురు చేసుకున్న పెళ్ళిని ఏ విధంగానూ క్షమించలేక పోయింది తల్లి.

ఇలాంటి నిర్ణయం ఎందుకు తీసుకున్నావే, అంది ఓ రోజు జడ అల్లుకుంటున్న సుందరితో.

అదా, ఆ రోజు రాధాకృష్ణతో నా పెళ్ళి జరగటానికి వీల్లేదని, అది నీ పరువుకి సంబంధించిందని అన్నావు చూడు, ఆ రోజే నిర్ణయించుకున్నా, చేసుకుంటే అలాంటి వాణ్ణే చేసుకోవాలని, గలగలా నవ్వుతూ అంది సుందరి, ఉదయ సంధ్యారాగం సుందరి బుగ్గల్ని రాగరంజితం చేస్తుంటే.....

– సురభి పక్ష పత్రిక 28 ఫిబ్రవరి 2003